602) సామంతం / శహన

ప॥ గోవిందు దాసులమై కొనకెక్కుదుముగాక । వేవేలువిధుల నమ్మి వెతబడగలమా ॥

చ॥ మనసులోపలిమర్మము దెలియలేము । ఘనుడైనహరి నెట్టు గానగలము ।
తనువుతో భోగాలు తగులు వీడగలేము । వెనకకర్మపాశాలు వీడించుకోగలమా ॥

చ॥ వడిబెట్టే యింద్రియాల వద్దని మానుపలేము । తొడరి సంసారము తోయగలమా ।
బడిబడి నానాటిబతుకు చెప్పుకోలేము । పొడలేటియితరుల బోధించగలమా ॥

చ॥ కొంకక ఆడినమాట గురుతువెట్టగలేము । లంకె వేదవాక్యము దలచగలమా ।
యింకా శ్రీవేంకటేశు డితడే మాదేవుడు । సంకెలేకుందుముగాక జాలిబడగలమా ॥